తెలంగాణ వెన్నెల వాక్కు
జాతీయ దినపత్రిక
TELANGANAVENNELA WAKKU
TGTEL/25/A0871

విలేకరులు కావలెను
ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తూ శరవేగంగా రాజకీయ పరిస్థితులపై వాస్తవ కథనాలు అందిస్తూ అనతి కాలంలోనే ప్రజాదరణ పొందిన తెలంగాణ వెన్నెల వాక్కు లో రాష్ట్ర వ్యాప్తంగా స్టాఫర్లు, ఆర్సీ ఇంచార్జీలు, మండల రిపోర్టర్లు కావలెను. అనుభవజ్ఞులకు ప్రాధాన్యం.. కొత్త వారికి ప్రోత్సాహం
మీరు పని చేయాలనుకుంటున్న కేంద్రాల్లో ఖాళీల వివరాల కోసం
7386173123 నంబర్‌ను సంప్రదించండి..
డి. యోగేష్ కుమార్, సీఈవో

హైదరాబాద్ సంపుటి : 02 సంచిక :35 18-08- 2026 మంగళవారం పేజీలు: 4 వెల:03/-

# సనత్‌నగర్‌లో సూపర్ స్పెషాలిటీ వైద్య విప్లవం

## పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం.. టిమ్స్ ఆసుపత్రి ప్రారంభం



హైదరాబాద్ బ్యూరో:
హైదరాబాద్ నగరంలో పేదలు, సామాన్య ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను ఉచితంగా అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. సనత్‌నగర్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన డాక్టర్ మర్రి చెన్నారెడ్డి తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్) సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి అందుబాటులోకి వచ్చింది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఆసుపత్రిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో పాటు పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.
నగరంలోని ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రులపై పెరుగుతున్న రోగుల భారాన్ని తగ్గించడంతో పాటు, రాష్ట్రంలోని పేద ప్రజలకు ఖరీదైన సూపర్ స్పెషాలిటీ వైద్యాన్ని ప్రభుత్వ రంగంలోనే అందించాలన్న లక్ష్యంతో ఈ ఆసుపత్రిని నిర్మించారు. గుండె, మెదడు, మూత్రపిండాలు, క్యాన్సర్, ట్రామా వంటి అత్యంత సంక్లిష్టమైన వ్యాధులకు ఒకే చోట ఆధునిక వైద్య సేవలు అందించేలా ఆసుపత్రిని తీర్చిదిద్దారు.
సనత్‌నగర్‌లోని పాత ఛాతీ ఆసుపత్రి ప్రాంగణంలో 22 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో, సుమారు రూ. 1,100 కోట్లకు పైగా వ్యయంతో ఈ భారీ వైద్య సముదాయాన్ని నిర్మించారు. దాదాపు 11 లక్షల చదరపు అడుగుల నిర్మాణ విస్తీర్ణంతో ఐదు బహుళ అంతస్తుల బ్లాకులను ఏర్పాటు చేశారు. మొత్తం 1,082 పడకల సామర్థ్యంతో ఆసుపత్రి రూపుదిద్దుకోగా, అత్యవసర వైద్య సేవల కోసం 300 ఐసీయూ పడకలు ప్రత్యేకంగా అందుబాటులో ఉంచారు. పెద్ద శస్త్రచికిత్సలను నిర్వహించేందుకు 31 మేజర్ ఆపరేషన్ థియేటర్లు ఏర్పాటు చేశారు.
ఆసుపత్రిలో దాదాపు 37 వైద్య విభాగాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. కార్డియాక్ సైన్సెస్, రీనల్ సైన్సెస్, న్యూరో సైన్సెస్, ట్రామా సైన్సెస్, ఆంకాలజీ, రేడియాలజీ వంటి కీలక విభాగాలతో పాటు వివిధ సూపర్ స్పెషాలిటీ సేవలు అందించనున్నారు.
అత్యవసర పరిస్థితుల్లో వచ్చే రోగులకు వేగంగా వైద్యం అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.
ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించడం ఈ ఆసుపత్రి ప్రత్యేకతగా నిలుస్తోంది. పరీక్షల కోసం సేకరించిన రక్తం, ఇతర నమూనాలను వేగంగా ల్యాబొరేటరీలకు తరలించేలా ఆధునిక న్యూమాటిక్ ట్యూబ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. దీంతో పరీక్షల సమయం తగ్గి, వైద్యులు త్వరగా నివేదికలు పొంది చికిత్స ప్రారంభించే అవకాశం ఉంటుంది. 3 టెస్లా ఎంఆర్ఐ, 128 స్లైస్ సీటీ స్కాన్, డిజిటల్ ఎక్స్‌రే, ఆధునిక క్యాథ్ ల్యాబ్ తదితర అత్యాధునిక వైద్య పరికరాలను కూడా అందుబాటులోకి తీసుకువచ్చారు.
దూర ప్రాంతాల నుంచి చికిత్స కోసం వచ్చే రోగుల బంధువుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆసుపత్రి ప్రాంగణంలోనే ఆరు అంతస్తుల ధర్మశాలను ఏర్పాటు చేశారు. దీంతో రోగులతో పాటు వచ్చే సహాయకులకు కూడా వసతి సౌకర్యం కల్పించే అవకాశం ఏర్పడింది.
ఆసుపత్రిలో వైద్యులు, నర్సింగ్, పారామెడికల్, సాంకేతిక సిబ్బందితో పాటు భారీ సంఖ్యలో సిబ్బందిని నియమించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.
ఇప్పటివరకు ఖరీదైన ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి ఎదురైన పేద కుటుంబాలకు టిమ్స్ ఒక పెద్ద ఊరటగా మారనుంది. లక్షల రూపాయలు ఖర్చయ్యే గుండె శస్త్రచికిత్సలు, న్యూరో చికిత్సలు, క్యాన్సర్ వైద్యం, కిడ్నీ సంబంధిత చికిత్సలు వంటి సేవలు ప్రభుత్వ రంగంలో అందుబాటులోకి రావడంతో సామాన్య ప్రజలకు భారీగా ఆర్థిక భారం తగ్గే అవకాశం ఉంది. గాంధీ, ఉస్మానియా, నిమ్స్ వంటి ఆసుపత్రులపై ఉన్న రద్దీని తగ్గించడంలోనూ సనత్‌నగర్ టిమ్స్ కీలకంగా మారనుంది. అత్యాధునిక మౌలిక వసతులు, విస్తృత వైద్య విభాగాలు, అధునాతన పరికరాలతో ప్రభుత్వ వైద్యరంగంలో కొత్త ప్రమాణాలను నెలకొల్పే దిశగా ఈ ఆసుపత్రి అడుగులు వేస్తోంది. పేదలకు నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యంగా టిమ్స్ సేవలు పూర్తిస్థాయిలో విస్తరించడంతో తెలంగాణ ప్రభుత్వ వైద్య రంగంలో ఇది మరో కీలక మైలురాయిగా నిలవనుంది.

# తెలంగాణలో ఎస్ఐఆర్ ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల

## 73 లక్షల పేర్లకు కోత.. 92 లక్షల మందికి నోటీసులు!




హైదరాబాద్ బ్యూరో:
తెలంగాణలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో కీలక ఘట్టం పూర్తయింది. ఎన్నికల సంఘం సోమవారం ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసింది. ఎన్యూమరేషన్ ప్రక్రియ అనంతరం రాష్ట్రంలో 2,64,87,214 మంది ఓటర్లతో ముసాయిదా జాబితాను రూపొందించినట్లు అధికారులు వెల్లడించారు. ఎస్ఐఆర్ ప్రక్రియకు ముందు రాష్ట్రంలో 3.38 కోట్లకు పైగా ఓటర్లు ఉండగా, తాజా పరిశీలనలో భారీగా మార్పులు చోటుచేసుకున్నాయి.క్షేత్రస్థాయి పరిశీలనలో ఆబ్సెంట్, షిఫ్టెడ్, డెడ్, డూప్లికేట్ కేటగిరీల కింద దాదాపు 73 లక్షల మంది ఓటర్లను గుర్తించారు. వీరిలో మరణించిన వారు, నివాస ప్రాంతాలు మార్చుకున్న వారు, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా తరలిపోయిన వారు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటు నమోదు చేసుకున్న వారు ఉన్నట్లు అధికారులు తెలిపారు.అదే సమయంలో ముసాయిదా జాబితాలో పేర్లు ఉన్నప్పటికీ వివరాల్లో వ్యత్యాసాలు ఉన్న 92 లక్షల మందికి పైగా ఓటర్లకు నోటీసులు జారీ చేయనున్నట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. వీరిలో 32 లక్షల మందికి పైగా అన్‌మ్యాప్‌డ్ ఓటర్లు ఉన్నట్లు, మరో 60 లక్షల మంది ఓటర్ల వివరాల్లో తండ్రి లేదా భర్త పేరు, వయస్సు, చిరునామా తదితర అంశాల్లో వ్యత్యాసాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు.నోటీసులు అందుకున్న ఓటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తమ ఓటు హక్కును నిర్ధారించుకునేందుకు సంబంధిత పత్రాలను సమర్పించవచ్చని అధికారులు స్పష్టం చేశారు. బూత్ స్థాయి అధికారులు నోటీసులను పోస్టు ద్వారా లేదా ఇంటింటికీ వెళ్లి అందించే చర్యలు చేపట్టనున్నారు.
ముసాయిదా జాబితాలో తమ పేరు ఉందో లేదో ప్రతి ఓటరూ తప్పనిసరిగా పరిశీలించుకోవాలని ఎన్నికల సంఘం సూచించింది. పేరు లేకపోయినా, వివరాల్లో తప్పులు ఉన్నా నిర్ణీత గడువులోగా సవరణకు అవకాశం కల్పించారు. సెప్టెంబర్ 16 వరకు అభ్యంతరాలు, దరఖాస్తులు స్వీకరించనున్నట్లు అధికారులు తెలిపారు.
కొత్తగా ఓటు నమోదు చేసుకునేందుకు ఫారం-6, ఫారం-6ఏ, అనర్హులైన ఓటర్ల పేర్లపై అభ్యంతరాలకు ఫారం-7, వ్యక్తిగత వివరాల సవరణకు ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని ఎన్నికల అధికారులు తెలిపారు.

# సర్కార్ నడుపుతున్నవా.. సర్కస్ నడుపుతున్నవా?

## మంత్రుల వ్యాఖ్యలపై హరీశ్‌రావు తీవ్ర విమర్శలు



హైదరాబాద్ బ్యూరో: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పాలన తీరుపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. మంత్రులు తమ నిర్ణయాలతో జరిగే తప్పులను కప్పిపుచ్చుకునేందుకు అధికారులను బాధ్యులను చేయడం సరికాదని ఆయన మండిపడ్డారు. మంత్రులు నిర్ణయాలు తీసుకుంటే.. తప్పులకు మాత్రం అధికారులు బలికావాలా? అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమర్థవంతమైన సర్కార్ నడుపుతున్నారా? లేక సర్కస్ నడుపుతున్నారా? అంటూ ఎక్స్ వేదికగా ఘాటు వ్యాఖ్యలు చేశారు.
కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి పేదల సంక్షేమ పథకాల విషయంలో ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలపై హరీశ్‌రావు అభ్యంతరం వ్యక్తం చేశారు. పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు అండగా నిలిచే పథకాలను నిలిపివేసే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. దీనిపై ప్రజల్లో వ్యతిరేకత రావడంతో తప్పును అధికారులపైకి నెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.
అదేవిధంగా 22ఏ భూముల వ్యవహారంలోనూ ప్రభుత్వం తీరును ఆయన తప్పుబట్టారు. భూ సమస్యలతో సామాన్యులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మంత్రులు చేసిన తప్పులకు అధికారులు బాధ్యత వహించాల్సిన అవసరం లేదని, నిర్ణయాలు తీసుకునేది మంత్రులేనని గుర్తు చేశారు. అధికారులపై చర్యలు తీసుకునే ముందు మంత్రుల నిర్లక్ష్యం, అవగాహన లోపం, పరిపాలనా వైఫల్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.
ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు ఇప్పటికే కొనసాగుతున్న సంక్షేమ పథకాలను ఎలాంటి కారణాలతోనూ నిలిపివేయవద్దని హరీశ్‌రావు కోరారు. పేద కుటుంబాలకు అందాల్సిన ఆర్థిక సహాయాన్ని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మంత్రులు మీడియా ముందు క్షమాపణలు చెప్పడం వల్ల ప్రజల సమస్యలు పరిష్కారం కావని, పాలనలో బాధ్యత వహించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ప్రజల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి, సంక్షేమ పథకాలను కొనసాగించాలని హరీశ్‌రావు కోరారు.

# బీజేపీ జాతీయ కార్యవర్గంలో ఏపీకి ప్రాధాన్యం

## పురందేశ్వరికి కీలక పదవి.. తెలంగాణకు మొండిచేయి!




న్యూఢిల్లీ బ్యూరో:భారతీయ జనతా పార్టీ నూతన జాతీయ కార్యవర్గాన్ని ప్రకటించింది. రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేయడం, రాష్ట్రాల్లో పార్టీ విస్తరణకు అనుగుణంగా అనుభవజ్ఞులు, కీలక నాయకులకు బాధ్యతలు అప్పగించడమే లక్ష్యంగా కొత్త కార్యవర్గాన్ని ఏర్పాటు చేసినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. అయితే ఈ నూతన జాబితా తెలుగు రాష్ట్రాల రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీసింది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌కు కీలక పదవి దక్కగా.. తెలంగాణకు మాత్రం జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం లేకపోవడం చర్చనీయాంశంగా మారింది.నూతన జాతీయ కార్యవర్గంలో ఆంధ్రప్రదేశ్‌కు అరుదైన గౌరవం దక్కింది. రాజమండ్రి పార్లమెంట్ సభ్యురాలు, సీనియర్ బీజేపీ నాయకురాలు దగ్గుబాటి పురందేశ్వరికి జాతీయ ఉపాధ్యక్షురాలి కీలక బాధ్యతలు అప్పగించారు. పార్టీకి సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్న ఆమె రాజకీయ అనుభవాన్ని పరిగణనలోకి తీసుకున్న అధిష్టానం ఈ బాధ్యతను అప్పగించినట్లు తెలుస్తోంది. కేంద్ర మంత్రిగా, రాష్ట్ర పార్టీ అధ్యక్షురాలిగా, జాతీయ స్థాయి నాయకురాలిగా పనిచేసిన అనుభవం పురందేశ్వరికి ఉండటంతో ఆమెకు మరోసారి కీలక బాధ్యత దక్కడం ప్రాధాన్యం సంతరించుకుంది.ఆంధ్రప్రదేశ్‌లో పార్టీ బలోపేతం, సంస్థాగత విస్తరణ, రాబోయే రాజకీయ పరిణామాల్లో బీజేపీ పాత్రను పెంచేందుకు పురందేశ్వరి అనుభవం ఉపయోగపడుతుందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. జాతీయ స్థాయిలో ఏపీకి ప్రాధాన్యం లభించడంతో రాష్ట్ర బీజేపీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.
అయితే తెలంగాణ విషయానికి వస్తే పరిస్థితి పూర్తిగా భిన్నంగా కనిపించింది. గత జాతీయ కార్యవర్గంలో కీలక బాధ్యతలు నిర్వహించిన మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణకు ఈసారి నూతన జాతీయ కార్యవర్గంలో చోటు దక్కలేదు. అంతేకాకుండా తెలంగాణ నుంచి మరో నేతకు కూడా జాతీయ కార్యవర్గంలో కీలక స్థానం కల్పించకపోవడం రాష్ట్ర బీజేపీ వర్గాల్లో చర్చకు దారితీసింది. తెలంగాణలో బీజేపీ ఇటీవలి కాలంలో తన రాజకీయ బలాన్ని పెంచుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోంది. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ ఓటు శాతం, సీట్ల పరంగా గణనీయమైన ప్రభావం చూపిన నేపథ్యంలో రాష్ట్రం నుంచి జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం ఉంటుందని పలువురు ఆశించారు. అయితే కొత్త జాబితాలో తెలంగాణకు ప్రాతినిధ్యం లేకపోవడంతో పార్టీ నాయకులు, కార్యకర్తల్లో అసంతృప్తి వ్యక్తమవుతున్నట్లు తెలుస్తోంది.
ముఖ్యంగా గతంలో జాతీయ స్థాయిలో కీలక బాధ్యతలు నిర్వహించిన డీకే అరుణను కొత్త కార్యవర్గంలో కొనసాగించకపోవడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. తెలంగాణలో పార్టీ విస్తరణకు, ముఖ్యంగా దక్షిణ తెలంగాణలో బీజేపీ బలోపేతానికి ఆమె కీలకంగా వ్యవహరించిన నేపథ్యంలో ఈ మార్పుపై పార్టీ వర్గాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావాలనే లక్ష్యంతో క్షేత్రస్థాయిలో పార్టీ కార్యక్రమాలను

# ప్రకృతిని జయించాలనుకుంటున్నామా..?

## లేక ప్రకృతితో కలిసి జీవించడం నేర్చుకుంటున్నామా?

మన పండుగలు ఇచ్చిన సందేశాన్ని ఆధునిక జీవితం ఎందుకు మరిచి పోతోంది ?మనిషి నాగరికత అభివృద్ధి చెందుతున్న కొద్దీ ప్రకృతిపై అతని ఆధిపత్యం పెరుగుతోంది. అడవులను రహదారులుగా మార్చుతున్నాం.. చెరువులను నిర్మాణాలుగా మార్చుతున్నాం.. కొండలను తొలుస్తున్నాం.. నదుల ప్రవాహాలను మార్చుతున్నాం. ప్రకృతి మన అవసరాలకు అనుగుణంగా మారాలని కోరుకుంటున్నాం. కానీ ఒక ప్రశ్న మాత్రం మన ముందుంది---ప్రకృతిని జయించడం నిజంగా అభివృద్ధేనా?

మన భారతీయ జీవన విధానం ఈ విషయంలో ఆధునిక సమాజానికి చాలా భిన్నమైన సందేశాన్ని ఇచ్చింది. ప్రకృతిని జయించమని కాదు.. ప్రకృతితో సహజీవనం చేయమని చెప్పింది.

మన పండుగలు, ఆచారాలు, సంప్రదాయాలను నిశితంగా పరిశీలిస్తే ఈ భావన అనేక రూపాల్లో కనిపిస్తుంది. చెట్లను పవిత్రంగా భావించడం, నదులను తల్లిగా పూజించడం, పర్వతాలను దైవ స్వరూపంగా చూడడం, పశుపక్ష్యాదులను ధార్మిక విశ్వాసాలతో అనుసంధానం చేయడం వెనుక కేవలం భక్తి మాత్రమే లేదు. ప్రకృతిలోని ప్రతి జీవికి ఒక విలువ ఉందనే భావన కూడా ఉంది.

ఇటీవలే నాగపంచమిని జరుపుకున్నాం. పామును దేవతా స్వరూపంగా భావించి పూజించే ఈ సంప్రదాయాన్ని కేవలం ఒక ఆచారంగా చూస్తే దాని పరిధి చాలా చిన్నదైపోతుంది. మనిషికి భయాన్ని కలిగించే ఒక జీవిని కూడా పవిత్రంగా భావించడం ద్వారా ప్రకృతిలో మనకు నచ్చని జీవులకూ జీవించే హక్కు ఉందనే భావనను మన పూర్వీకులు సమాజంలో నాటారు.

ఇది నేటి తరానికి చాలా ముఖ్యమైన సందేశం.

మనిషి తనకు ఉపయోగపడే జీవులను మాత్రమే కాపాడి, ప్రమాదకరంగా కనిపించే జీవులను నాశనం చేస్తే ప్రకృతి సమతుల్యత దెబ్బతింటుంది. ఒక జీవి కనిపించకపోవడం వల్ల మరొక జీవి సంఖ్య పెరగవచ్చు. ఒక జాతి తగ్గిపోవడం వల్ల మొత్తం పర్యావరణ వ్యవస్థలో మార్పులు రావచ్చు. ప్రకృతి అనేది విడివిడిగా ఉన్న జీవుల సమూహం కాదు.. ఒకదానితో ఒకటి అనుసంధానమైన జీవ వ్యవస్థ.

అందుకే పర్యావరణ పరిరక్షణ అనేది కేవలం ప్రభుత్వాల బాధ్యత కాదు. అది ప్రతి కుటుంబానికి, ప్రతి పౌరుడికి సంబంధించిన విషయం.

ఇంట్లో నీటిని వృథా చేయకుండా చూడటం కూడా పర్యావరణ బాధ్యతే. అవసరం లేని ప్లాస్టిక్‌ను తగ్గించడం కూడా ప్రకృతి సేవే. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా ఉండటం కూడా సామాజిక ధర్మమే. చెట్టును నాటడం గొప్ప పని అయితే, నాటిన చెట్టును పెంచడం అంతకంటే గొప్ప బాధ్యత.

మన పూర్వీకుల జీవన విధానంలో ప్రకృతికి ఇచ్చిన గౌరవం ఒక రకమైన జీవన తత్వం. ఉదయం లేచిన వెంటనే భూమికి నమస్కరించే సంప్రదాయం నుంచి, నదిని పవిత్రంగా భావించడం వరకు ఎన్నో ఆచారాల్లో ప్రకృతి పట్ల కృతజ్ఞత కనిపిస్తుంది.

కానీ ఆధునిక జీవితం మనిషిని వినియోగదారుడిగా మార్చింది. మనకు అవసరమైనది ఎక్కడి నుంచి వస్తోంది? దాని కోసం ప్రకృతిపై ఎంత భారం పడుతోంది? మనం ఉపయోగించిన తర్వాత అది ఎక్కడికి వెళ్తోంది? అనే ప్రశ్నలు చాలా అరుదుగా ఆలోచిస్తున్నాం.

ఒక ప్లాస్టిక్ బాటిల్‌ను మనం చెత్తబుట్టలో వేయడం ద్వారా మన బాధ్యత పూర్తయిందనుకుంటాం. కానీ అది అక్కడి నుంచి ఎక్కడికి వెళ్తుంది? ఒకసారి ఉపయోగించి పారేసిన వస్తువుల ప్రభావం నేలపై, నీటిపై, జంతువులపై ఎలా పడుతుంది? అనే ఆలోచన అవసరం.

ఇక్కడే ధర్మం మరియు పర్యావరణం కలిసే చోటు కనిపిస్తుంది.

ధర్మం అంటే కేవలం పూజలు చేయడం కాదు. మన వల్ల మరొక జీవికి అనవసరమైన నష్టం కలగకుండా జీవించడం కూడా ధర్మమే. మనకు లభించిన ప్రకృతి వనరులను భవిష్యత్ తరాలకు కూడా అందేలా కాపాడటం కూడా మన బాధ్యతే.

నేటి పిల్లలకు పండుగల కథలు చెప్పడంతో పాటు వాటి వెనుక ఉన్న జీవన సందేశాన్ని కూడా చెప్పాలి. నాగపంచమి అంటే పాముల పూజ మాత్రమే కాదు.. ప్రకృతిలోని జీవ వైవిధ్యాన్ని గుర్తుచేసే సందర్భం. వనమహోత్సవం అంటే చెట్టు నాటడం మాత్రమే కాదు.. చెట్టుతో మనిషికి ఉన్న సంబంధాన్ని గుర్తుచేసుకోవడం. నదిని పూజించడం అంటే పూలు వేసి వెళ్లిపోవడం కాదు.. నది కలుషితం కాకుండా కాపాడటం.ఆచారం ఒకరోజు జరగవచ్చు. కానీ దాని సందేశం ఏడాది పొడవునా మన జీవితంలో ఉండాలి.

ప్రకృతి మనకు ఎన్నో ఇచ్చింది. గాలి, నీరు, ఆహారం, ఔషధాలు, నివాసం---మన జీవితం మొత్తం ప్రకృతిపైనే ఆధారపడి ఉంది. అయినప్పటికీ మనిషి ప్రకృతికి తాను యజమాని అన్నట్లు ప్రవర్తిస్తున్నాడు.

ప్రకృతి మనిషిని హెచ్చరించడానికి పెద్దగా మాట్లాడదు. కానీ ఎండ తీవ్రతలో, నీటి కొరతలో, వరదల్లో, భూకంపాల్లో, వాతావరణ మార్పుల్లో తన ప్రభావాన్ని చూపిస్తుంది.

అందుకే ఇప్పుడు ప్రకృతిని జయించాలనే ఆలోచన నుంచి ప్రకృతితో కలిసి జీవించాలనే ఆలోచన వైపు మన ప్రయాణం మారాలి.

మన పూర్వీకులు ప్రకృతిలో దేవుడిని చూశారు. ఆధునిక శాస్త్రం ప్రకృతిలో జీవ వ్యవస్థను చూస్తోంది. భాష వేరైనా సందేశం ఒక్కటే---

ప్రకృతిని కాపాడితే మనల్ని మనం కాపాడుకున్నట్టే.

పండుగలు ముగిసిపోవచ్చు. పూజలు పూర్తవచ్చు. కానీ వాటి వెనుక ఉన్న సందేశం మన జీవితంలో మిగిలితేనే ఆ సంప్రదాయాలకు అసలైన అర్థం ఉంటుంది.

ప్రకృతిపై మనిషి విజయం సాధించడం గొప్ప విషయం కాదు...

మనిషి ప్రకృతితో కలిసి జీవించడం నేర్చుకున్న రోజే అసలైన నాగరికతకు విజయం.



**విశ్లేషణ: దేగామ యోగేష్ కుమార్**
**సీనియర్ జర్నలిస్ట్**
**తెలంగాణ వెన్నెల వాక్కు**

# సెప్టెంబర్ 2న పూరి జగన్నాథ్ యాత్ర ప్రత్యేక బస్సు: డీఎం




నిర్మల్, ఆగస్టు 17 (తెలంగాణ వెన్నెల వాక్కు): ఆర్టీసీ నిర్మల్ డిపో నుండి సెప్టెంబర్ 2న పూరి జగన్నాథ్ యాత్రకు ప్రత్యేక లగ్జరీ బస్సును నడపనున్నట్లు డిపో మేనేజర్ కే. పండరి ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ బస్సు అన్నవరం, సింహాచలం, శ్రీకూర్మం, కోణార్క్, పూరి, ద్వారకా తిరుమల మీదుగా సాగుతుంది.ఆరు రోజుల యాత్ర ముగించుకుని సెప్టెంబర్ 7న తిరిగి నిర్మల్ చేరుకుంటుందన్నారు.ఒక్కొక్కరికి టికెట్ ఛార్జీ 6,400 రూపాయలుగా నిర్ణయించినట్లు ఆయన పేర్కొన్నారు.ప్రయాణికులు భోజన, వసతి ఖర్చులను స్వయంగా భరించుకోవాల్సి ఉంటుందని తెలిపారు.ఆసక్తి గల భక్తులు బస్టాండ్ రిజర్వేషన్ కౌంటర్‌లో ముందస్తుగా బుకింగ్ చేసుకోవచ్చన్నారు.మరిన్ని వివరాల కోసం 9959226003 లేదా 7382842582 నంబర్లలో సంప్రదించాలన్నారు.ఈ ప్రత్యేక ఆధ్యాత్మిక యాత్రను భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.భక్తుల సౌకర్యార్థం అనుభవజ్ఞులైన సిబ్బందిని బస్సులో నియమిస్తున్నట్లు తెలిపారు.

# ఉట్నూర్‌లో ఘనంగా కాంగ్రెస్ పార్టీ పీఏసీ సమావేశం



ఉట్నూర్/నిర్మల్, ఆగస్టు 17 (తెలంగాణ వెన్నెల వాక్కు): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అఫైర్స్ కమిటీ (పీఏసీ) సమావేశం ఉట్నూర్ పట్టణంలోని జీఎన్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో సోమవారం జరిగింది. ఈ సమావేశానికి నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ కూచాడి శ్రీహరిరావు హాజరయ్యారు.ఉమ్మడి జిల్లాలోని ముఖ్య ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు పాల్గొని చర్చించారు.పార్టీ సంస్థాగత బలోపేతం, క్షేత్రస్థాయి కార్యాచరణపై విస్తృతంగా అభిప్రాయాలు పంచుకున్నారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలను గ్రామగ్రామాన ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలన్నారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.ప్రజా సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ శ్రేణులు నిరంతరం ముందంజలో ఉండాలన్నారు.కార్యకర్తల సమస్యలను పరిష్కరిస్తూ పార్టీకి తగిన ప్రాధాన్యత కల్పిస్తామన్నారు.సమావేశంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# ముధ్గల్‌లో సీసీ కెమెరాల ఏర్పాటు

ముథోల్, ఆగస్టు 17(తెలంగాణ వెన్నెల వాక్కు ):ముథోల్ మండలం ముధ్గల్ గ్రామంలో ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. గ్రామ సర్పంచ్ మేకల అనురాధ గణపతి యాదవ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో ఎస్సై బిట్ల పెర్సిస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గ్రామంలోని ప్రధాన ప్రాంతాలు, రహదారులు, ప్రజలు ఎక్కువగా రాకపోకలు సాగించే ప్రదేశాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం ద్వారా నిరంతరం నిఘా కొనసాగుతుందని తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడంతో పాటు, ఏదైనా ఘటన చోటుచేసుకున్నప్పుడు దర్యాప్తులో కెమెరాల దృశ్యాలు కీలకంగా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. గ్రామంలో భద్రతా చర్యలను మరింత పటిష్టం చేయడంలో భాగంగానే సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రామచందర్ తదితరులు పాల్గొన్నారు.



# గ్రామాల్లో ఘనంగా నాగుల పంచమి వేడుకలు



ముథోల్, ఆగస్టు 17(తెలంగాణ వెన్నెల వాక్కు ):మండల కేంద్రమైన ముథోల్‌తో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం నాగుల పంచమి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. పండుగను పురస్కరించుకుని తెల్లవారుజామునే మహిళలు, భక్తులు సమీపంలోని నాగుల పుట్టలు, ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. నాగదేవతకు పాలు, పూలు, పసుపు, కుంకుమ సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి పూజా సామగ్రితో నాగుల పుట్టల వద్దకు చేరుకున్నారు. పుట్టలకు పూజలు నిర్వహించి పాలు పోసి, కుటుంబ సభ్యుల ఆయురారోగ్యాలు, సుఖసంతోషాల కోసం ప్రార్థనలు చేశారు. పలుచోట్ల ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించడంతో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నాగుల పంచమి సందర్భంగా పట్టణంతో పాటు గ్రామాల్లో పండుగ సందడి నెలకొంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఆయా ప్రాంతాల్లో నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. పండుగ సందర్భంగా ఆలయాలు, నాగుల పుట్టల వద్ద ఆధ్యాత్మిక వాతావరణం కనిపించింది.

# లక్ష్మణచాందలో దొంగిలించిన మోటార్ సైకిల్ స్వాధీనం: ఇద్దరి అరెస్ట్



లక్ష్మణచాంద, ఆగస్టు 17 (తెలంగాణ వెన్నెల వాక్కు): కనకాపూర్ గ్రామంలో ఇంటి ముందు పార్క్ చేసిన టీవీఎస్ ఎక్సెల్ బైక్‌ను చోరీ చేసి విక్రయించిన కేసులో ఇద్దరు నిందితులను లక్ష్మణచాంద పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కనకాపూర్ గ్రామానికి చెందిన సాయిలు అనే వ్యక్తిజల్సాల కోసం బైక్‌ను దొంగిలించి షేక్ రంజన్‌కు 5 వేల రూపాయలకు అమ్మేశాడు. చోరీ బైక్ అని తెలిసినప్పటికీ తక్కువ ధరకు వస్తుందనే ఆశతో రంజన్ దానిని కొనుగోలు చేశాడు.సోమవారం మధ్యాహ్నం లక్ష్మణచాంద వద్ద వాహన తనిఖీల్లో రంజన్ బైక్‌తో పట్టుబడ్డాడు.పోలీసుల విచారణలో బైక్ దొంగతనం చేసినట్లు ఇద్దరు నిందితులు నేరాన్ని అంగీకరించారు.వారి వద్ద నుండి మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.చోరీ వస్తువులను కొనుగోలు చేసినా చట్టపరంగా నేరమేనని పోలీసులు హెచ్చరించారు.అనుమానాస్పద వ్యక్తులు బైకులు విక్రయిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

# శాపమా.. పాపమా.. అయ్యో దేవుడా..!

## ..పసికందును కాపాడేందుకు దాతల సాయం కోసం వేడుకోలు

ముథోల్, ఆగస్టు 17(తెలంగాణ వెన్నెల వాక్కు ):మండల కేంద్రమైన ముథోల్ కు చెందిన రమేష్, జ్యోతి దంపతుల కుటుంబంలో వరుస విషాదాలు చోటుచేసుకున్నాయి. రెండో, మూడవ సంతానం పుట్టిన వెంటనే మృతిచెందడంతో ఆ తల్లిదండ్రులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. నాల్గోవ సంతానం పుట్టిందన్న సంతోషం కూడా ఎంతోసేపు నిలవకముందే మరో విషాదం వారిని కుదిపేసింది. కళ్లు కూడా సరిగా తెరవని పసికందు ప్రస్తుతం నిజామాబాద్‌లోని ఓ ఆస్పత్రిలోని ఐసీయూలో ప్రాణాలతో పోరాడుతున్నాడు. పసికందు పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. తల్లి జ్యోతి భైంసాలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. రమేష్, జ్యోతి దంపతుల కుటుంబ పరిస్థితి కూడా అత్యంత దయనీయంగా ఉంది. రేకుల ఇంట్లో నివసిస్తూ, రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితిలో జీవనం సాగిస్తున్నారు. ఇలాంటి సమయంలో నవజాత శిశువుకు ఖరీదైన వైద్యం అవసరం కావడంతో కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటోంది.తన బిడ్డను ఎలాగైనా కాపాడాలని తల్లి చేతులు జోడించి కన్నీటితో వేడుకుంటున్న దృశ్యం పలువురిని కంటతడి పెట్టిస్తోంది. అభం శుభం తెలియని ఆ పసికందు ప్రాణాల కోసం కుటుంబ సభ్యులు దాతల సహాయం కోరుతున్నారు.మానవత్వంతో స్పందించే దాతలు తమకు తోచినంత ఆర్థిక సహాయం అందించి పసికందు చికిత్సకు అండగా నిలవాలని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు. చిన్నారి ప్రాణాలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరుతున్నారు. సహాయం చేయదలచిన వారు 9100059340, 9704973532, 9966027148 ఫోన్ పే నెంబర్లకు పంపాలని కోరారు.



# బాసర మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి ప్రారంభం



బాసర, ఆగస్టు 17 (తెలంగాణ వెన్నెల వాక్కు):
బాసర మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో సోమవారం ప్రజల సమస్యల పరిష్కారార్థం నూతనంగా ప్రజావాణి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం ప్రారంభమైంది. ఎంపీడీవో దేవేందర్, తహసీల్దార్ పవన్ చంద్ర ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలు, తాగునీటిపై ప్రజలు వినతులు సమర్పించారు. అధికారులు ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. వివిధ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో సమస్యలను పరిష్కరించాలన్నారు. గ్రామీణ ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం దూరప్రాంతాలకు వెళ్లకుండామండల కేంద్రంలోనే ప్రజావాణి ద్వారా సత్వర న్యాయం పొందవచ్చని తెలిపారు. ప్రతి సోమవారం ఈ ప్రజావాణి కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల మండల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఉద్యోగులందరూ 'మీ ప్రమాణం' యాప్‌లో నమోదు కావాలి: కలెక్టర్



నిర్మల్, ఆగస్టు 17 (తెలంగాణ వెన్నెల వాక్కు):
జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో పనిచేసే ఉద్యోగులు 'మీ ప్రమాణం' ముఖ గుర్తింపు హాజరు యాప్‌లో తప్పనిసరిగా నమోదు కావాలని కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో హాజరు నమోదు, సెన్సస్ హ్యాండ్‌బుక్‌పై సమీక్ష నిర్వహించారు. రెగ్యులర్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది అంతా యాప్ ద్వారానే హాజరు వేయాలన్నారు. ఇప్పటివరకు నమోదు చేసుకోని శాఖలు వెంటనే ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. హాజరు నమోదులో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. శాఖాధిపతులు నిరంతరం సిబ్బంది పనితీరు, హాజరును పర్యవేక్షించాలని సూచించారు. జిల్లా సెన్సస్ హ్యాండ్‌బుక్ రూపకల్పనకు పక్కా సమాచారాన్ని అందించాలన్నారు. సమీక్షలో అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డీఆర్‌ఓ రమేష్ పాల్గొన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సమయపాలన పాటించేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

# జిల్లా కేంద్రంలో జిల్లా సెన్సస్ హ్యాండ్‌బుక్‌పై కలెక్టర్ సమీక్ష



నిర్మల్, ఆగస్టు 17 (తెలంగాణ వెన్నెల వాక్కు):
నిర్మల్ జిల్లా సమగ్ర అభివృద్ధికి దిక్సూచిలా నిలిచే సెన్సస్ హ్యాండ్‌బుక్ రూపకల్పనపై కలెక్టర్ భవేశ్ మిశ్రా సోమవారం కలెక్టరేట్‌లో అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లాలోని జనాభా, అక్షరాస్యత, భౌగోళిక పరిస్థితులపై సమగ్ర వివరాలు సేకరించాలన్నారు. విద్య, వైద్యం, మౌలిక వసతులు, పారిశుధ్య వివరాలను కచ్చితత్వంతో అందించాలని ఆదేశించారు. శాఖల వారీగా అందించే సమాచారంలో ఎలాంటి తప్పులకు తావు ఉండకూడదన్నారు. క్షేత్రస్థాయిలో పునఃపరిశీలించిన తర్వాతే డేటాను నివేదికలో పొందుపరచాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల పక్కా అమలుకు ఈ నివేదిక ప్రామాణికంగా ఉపయోగపడుతుందన్నారు. ప్రణాళిక, రెవెన్యూ శాఖలు సమన్వయంతో గడువులోగా నివేదిక సమర్పించాలని సూచించారు.
సమావేశంలో అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, అధికారులు పాల్గొన్నారు. పక్కా ప్రణాళికతో జిల్లా హ్యాండ్‌బుక్ రూపొందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

# తెలంగాణ బీజేపీ స్వయంకృతాపరాధం

## -- అధిష్టాన గ్రహణం వెనుక అసలు నిజాలు

భారతీయ జనతా పార్టీ కొత్త జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ నేతృత్వంలో సోమవారం ప్రకటించిన నూతన జాతీయ కార్యవర్గ జాబితా తెలంగాణ రాష్ట్ర బీజేపీ నాయకత్వ ముఖంపై కొట్టిన బలమైన చెంపపెట్టు. దక్షిణాదిలో కర్ణాటక తర్వాత తెలంగాణలోనే అధికారాన్ని పిడికిట్లోకి తెచ్చుకుంటామని, రాష్ట్రాన్ని కమల వికాసానికి అడ్డాగా మారుస్తామని ఢిల్లీ పీఠం ముందు ఎగిరెగిరి పడ్డ అగ్రనాయకులకు ఈ రోజు చేదు నిజం బోధపడింది. 13 మంది జాతీయ ఉపాధ్యక్షులు, 8 మంది ప్రధాన కార్యదర్శుల సుదీర్ఘ జాబితాలో తెలంగాణ నుంచి ఒక్కరంటే ఒక్క నాయకుడి పేరు కూడా లేకపోవడం కేవలం ఒక సాంకేతిక లోపం కాదు; అది అధిష్టానం విసిరిన తీవ్ర ఆగ్రహ జ్వాల. పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ నుంచి దగ్గుబాటి పురందేశ్వరికి జాతీయ ఉపాధ్యక్ష పదవి, విష్ణువర్ధన్ రెడ్డికి సంయుక్త సమన్వయకర్తగా కీలక బాధ్యతలు దక్కిన చోట, అత్యంత ప్రాధాన్యత ఉందనుకున్న తెలంగాణకు సున్నా చుట్టడం వెనుక ఢిల్లీ పెద్దలు పంపిన స్పష్టమైన సందేశం ఉంది.



**కార్యకర్తల ఆవేదన.. నాయకుల అహంకారం**

తెలంగాణలో బీజేపీ క్షేత్రస్థాయి బలం లేక దెబ్బతినడం లేదు; కేవలం నాయకుల అహంకారం, సొంత అజెండాల వల్ల కుదేలవుతోంది. ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షాల ప్రజాదరణను, హిందూత్వ భావజాలాన్ని నమ్ముకుని వేలాదిమంది కార్యకర్తలు క్షేత్రస్థాయిలో వీధుల్లో పోరాటాలు చేస్తుంటే, రాష్ట్రంలో ఉన్న అగ్రనేతలు మాత్రం 'ఎవరికి వారే యమునా తీరే' అన్నట్లుగా విడిపోయారు. గ్రూపు రాజకీయాలు, అంతర్గత కలాపాలు, సొంత ఇమేజ్ పెంచుకునే ప్రయత్నాలు తప్ప పార్టీ ప్రయోజనాలను పట్టించుకున్న దాఖలాలు లేవు. పదవుల కోసం ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణలు చేయడం తప్ప, రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాల వైఫల్యాలపై లేదా ప్రజా సమస్యలపై ఒక సమగ్రమైన, సుదీర్ఘమైన పోరాట కార్యాచరణ రూపొందించడంలో వీరు ఘోరంగా విఫలమయ్యారు. ఒకరిని ఒకరు వెనకనుంచి తొక్కేసే చౌకబారు రాజకీయాల్లో మునిగి తేలుతున్న నాయకులకు అధిష్టానం ఈ రూపంలో తగిన గుణపాఠం చెప్పిందని భావించవచ్చు.

**ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా దక్కని ప్రాధాన్యం**

రాష్ట్రం నుంచి కేంద్ర మంత్రివర్గంలో ఇద్దరు ఉద్దండులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కానీ, రాష్ట్ర పార్టీ శ్రేణుల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపడంలో గానీ, జాతీయ స్థాయిలో తెలంగాణకు ఒక బలమైన స్థానాన్ని తెచ్చిపెట్టడంలో గానీ వారు దారుణంగా విఫలమయ్యారనేది ఈ జాబితాతో తేటతెల్లమైంది. "మా మాట వింటేనే కేంద్రంలో పనులు జరుగుతాయి" అని మైకుల ముందు గంభీర ప్రసంగాలు చేసే ఈ నాయకులు, సొంత రాష్ట్రానికి చెందిన ఒక్క ప్రతినిధికి కూడా జాతీయ కార్యవర్గంలో చోటు కల్పించలేకపోయారంటే వారి రాజకీయ ప్రభావం ఎంతటిదో అర్థం చేసుకోవచ్చు. అధిష్టానం దృష్టిలో రాష్ట్ర నాయకత్వం తన నమ్మకాన్ని (జతీవఎఱవఎఱశ్రీఱఎ) ఎంత దారుణంగా కోల్పోయిందో చెప్పడానికి ఈ పరిణామమే ప్రత్యక్ష నిదర్శనం. కేంద్ర మంత్రులుగా ఉండి కూడా రాష్ట్రంలో నాయకులను సమన్వయం చేయలేకపోవడం వారి అసమర్థతకే అద్దం పడుతోంది.

**ప్రగల్భాలకే పరిమితమైన ఆశలు..మోదీ కలలు సున్నానేనా?**

తెలంగాణను దక్షిణాదిలో తమ తదుపరి శ్రేణి కోటగా మలుచుకోవాలనేది ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షాల డ్రీమ్ ప్రాజెక్ట్. కానీ రాష్ట్ర నాయకత్వం ప్రదర్శిస్తున్న తీరు వల్ల ఆ ఆశలన్నీ అడియాసలయ్యే ప్రమాదం కనిపిస్తోంది. ప్రతి ఎన్నికల ముందు "వచ్చేది మా ప్రభుత్వమే, మేమే ప్రత్యామ్నాయం" అంటూ రొడ్డకొట్టుడు స్టేట్‌మెంట్లు ఇవ్వడం, తీరా ఫలితాలు వచ్చాక తలపట్టుకుని అంతర్గత కుమ్ములాటలకు దిగడం పరిపాటిగా మారింది. కేవలం మీడియా మైకుల ముందు ప్రత్యర్థులపై విమర్శలు కురిపించడం, సోషల్ మీడియాలో హంగామా చేయడం ద్వారా అధికారం రాదని అధిష్టానం గుర్తించింది. బలమైన సంస్థాగత నిర్మాణం, కట్టుదిట్టమైన ఐక్యత లేకపోతే ఎన్నికల్లో విజయం సాధించడం సాధ్యం కాదని గ్రహించిన ఢిల్లీ పెద్దలు, ఈ వైఖరిని సహించేది లేదని కండకావరంతో ఉన్న నేతలకు స్పష్టం చేశారు.

**రాష్ట్ర కమిటీ ప్రదర్శన ఒ పార్టీ ఉనికికి ముప్పు**

జాతీయ కమిటీలో ప్రాతినిధ్యం దక్కకపోవడం మాత్రమే కాకుండా, ప్రస్తుత రాష్ట్ర కమిటీ పనితీరు కూడా ఆశాజనకంగా లేదు. ప్రజలను, తటస్థ ఓటర్లను తనవైపు తిప్పుకోవడంలో రాష్ట్ర కమిటీ తీవ్రంగా తడబడుతోంది. ఒకవైపు అధికార, ప్రతిపక్ష పార్టీలు తమ రాజకీయ వ్యూహాలతో దూసుకుపోతుంటే, బీజేపీ మాత్రం అంతర్గత విభేదాల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతోంది. జాతీయ స్థాయిలో లభించని ఈ ప్రాధాన్యత ప్రభావం రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై తీవ్రంగా పడనుంది. క్షేత్రస్థాయి కార్యకర్తల నైతిక స్థైర్యం దెబ్బతిని, వారు పార్టీ కార్యక్రమాలకు దూరమయ్యే ప్రమాదం ఉంది.

**ఆత్మావలోకనం చేసుకోకపోతే చరిత్రహీనులుగా మిగిలిపోతారు!**

ఈ పరాభవం తర్వాతైనా తెలంగాణ బీజేపీ నాయకత్వం కళ్ళు తెరవాల్సి ఉంది. ఇప్పటికైనా తానా అంటే తందానా అనే భజన పరులను, సమాచారాన్ని తప్పుదోవ పట్టించే కోటరీలను పక్కనబెట్టాలి. వ్యక్తిగత స్వార్థాలను, నాయకత్వ అహాలను త్యాగం చేసి, నిజమైన కష్టపడే తత్వాన్ని నమ్ముకోవాలి. ఢిల్లీ పెద్దలు ఇచ్చిన ఈ గట్టి షాక్‌ను ఒక హెచ్చరికగానో, ఆత్మావలోకనానికి ఒక అవకాశంగానో తీసుకోకపోతే, తెలంగాణ రాజకీయ చిత్రపటంలో బీజేపీ ఉనికి కేవలం ప్రెస్ నోట్లకు, టీవీ డిబేట్లకు మాత్రమే పరిమితమయ్యే ప్రమాదం ఉంది. మోదీ బొమ్మను చూపి ప్రతిసారీ ఓట్లు అడిగే రోజులు పోయాయని, సొంతంగా ప్రజాబలాన్ని, సంస్థాగత ఐక్యతను చాటుకుంటేనే గుర్తింపు లభిస్తుందని నూతన జాతీయ కార్యవర్గ ప్రకటన చాటిచెప్పింది. ఇకనైనా మారకపోతే తెలంగాణలో కమల దళం ఒక "తాత్కాలిక అధ్యాయం"గా మిగిలిపోక తప్పదు!



వెంకగారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ
9848559863

# ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి: అదనపు కలెక్టర్



నిర్మల్, ఆగస్టు 17 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ప్రజావాణిలో వచ్చిన అర్జీలను అధికారులు ఎప్పటికప్పుడు త్వరితగతిన పరిష్కరించాలనిజిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు ఆదేశాలు జారీ చేశారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో పాల్గొన్నారు. ప్రజల నుండి విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యల వినతులు స్వీకరించారు. ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖాధికారులు క్షుణ్ణంగా పరిశీలించిస్పందించాలన్నారు. మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను జాప్యం లేకుండా పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతోపనిచేయాలన్నారు. బాధితులకు సత్వర న్యాయం జరిగేలా పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, డీఆర్‌ఓ రాథోడ్ రమేష్ పాల్గొన్నారు. అర్జీదారులకు రశీదులు అందజేసి నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలన్నారు.

# ఆలయాల్లో చోరీల నివారణకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ

నిర్మల్, ఆగస్టు 17 (తెలంగాణ వెన్నెల వాక్కు): జిల్లాలోని దేవాలయాలు, వ్యాపార సంస్థలు, ఇళ్ల వద్ద భద్రతా చర్యలు పటిష్టం చేయాలనినిర్మల్ జిల్లా ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల ప్రజలకు మరియు ఆలయ కమిటీలకు సూచించారు. చోరీ కేసుల ఛేదన అనంతరం ఎస్పీ మాట్లాడుతూ రాత్రి వేళల్లో గస్తీ ముమ్మరం చేశామన్నారు. ఆలయాల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు, సెక్యూరిటీ ఏర్పాట్లు ఉండాలని తెలిపారు. విలువైన వెండి, బంగారు ఆభరణాలను సురక్షిత ప్రాంతాల్లో భద్రపరచాలనిసూచించారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలు కనిపిస్తే వెంటనే 100 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. దొంగతనాలకు పాల్పడే నిందితులపై పీడీ యాక్ట్ కింద చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల ఆస్తిపాస్తుల రక్షణకు జిల్లా పోలీసు యంత్రాంగం నిరంతరం కట్టుబడి ఉందన్నారు. టాస్క్ ఫోర్స్ బృందాల ద్వారా నిరంతర తనిఖీలు కొనసాగుతాయని ఎస్పీఇ పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలు పోలీసులకు సహకరించాలని పిలుపునిచ్చారు.

# దొంగతనాల కేసులను ఛేదించిన పోలీసు అధికారులకు ఎస్పీ అభినందన

నిర్మల్, ఆగస్టు 17 (తెలంగాణ వెన్నెల వాక్కు):
జిల్లా వ్యాప్తంగా 25 చోరీ కేసుల్లో ప్రమేయం ఉన్న ఐదుగురు దొంగల ముఠాను పట్టుకున్నపోలీసు అధికారులు, టాస్క్ ఫోర్స్ సిబ్బందిని ఎస్పీ జానకి షర్మిల ఘనంగా అభినందించారు. భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్ పర్యవేక్షణలో బృందాలు పనిచేశాయన్నారు. కేసులను వేగంగా ఛేదించిన సీఐలు కృష్ణ, సమ్మయ్యలను ప్రత్యేకంగా ప్రశంసించారు. ఎస్సైలు లింబాద్రి, గణేష్, శ్రీకాంత్, గఫార్, సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించారన్నారు. సాంకేతిక ఆధారాలను విశ్లేషించి నిందితులను పట్టుకోవడంలో కృషి చేశారని కొనియాడారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన సిబ్బందికి రివార్డులు అందజేస్తామని ఎస్పీ తెలిపారు. నేర రహిత జిల్లాగా నిర్మల్‌ను తీర్చిదిద్దేందుకు అధికారులు మరింత శ్రమించాలన్నారు. ఈ సమావేశంలో పోలీసు అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పోలీసు శాఖ సమర్థవంతమైన పనితీరు పట్ల ప్రజల్లో నమ్మకం పెరిగిందన్నారు.

# బెస్తవార్‌పేట్‌లో రెండవ రోజు 56 కోతుల పట్టివేత



నిర్మల్, ఆగస్టు 17 (తెలంగాణ వెన్నెల వాక్కు):
నిర్మల్ పట్టణంలోని 25వ వార్డు బెస్తవార్‌పేట్ కాలనీలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో రెండవ రోజు నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో 56 కోతులను పట్టుకున్నారు.
మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి పర్యవేక్షణలో ఈ కార్యక్రమం సాగింది. పట్టుబడిన కోతులకు రంగులు చల్లి కవ్వాల్ అటవీ ప్రాంతానికి సురక్షితంగా తరలించారు. రెండు రోజుల్లో కలిపి కాలనీలో మొత్తం 128 కోతులను బంధించినట్లు అధికారులు తెలిపారు. కోతుల బెడద నుండి ఉపశమనం లభించడంతో కాలనీ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలోని అన్ని వార్డుల్లోనూ నిరంతరాయంగా కోతుల పట్టివేత కొనసాగుతుందన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన రక్షణ చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ లక్కాకుల హరీష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ పాల్గొన్నారు. పారిశుధ్య సిబ్బందికి ప్రజలు సహకరించాలని మున్సిపల్ అధికారులు కోరారు.

# 25 చోరీల కేసులను ఛేదించిన టైగర్స్ టాస్క్‌ఫోర్స్

**- ఆలయాలు, ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న ఐదుగురు అంతర్రాష్ట్ర దొంగల అరెస్ట్**
**- నిందితుల నుండి 3 బైకులు, బంగారం, వెండి, 5 మొబైల్ ఫోన్లు స్వాధీనం**




నిర్మల్, ఆగస్టు 17 (తెలంగాణ వెన్నెల వాక్కు):
నిర్మల్ జిల్లాలోని పలు ఆలయాలు, ఇళ్లు, వ్యాపార సముదాయాలను లక్ష్యంగా చేసుకుని వరుస చోరీలకు పాల్పడుతున్న ఐదుగురు అంతర్రాష్ట్ర దొంగల ముఠాను జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. జిల్లా ఎస్పీ జానకి షర్మిల నేతృత్వంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'టైగర్స్ టాస్క్ ఫోర్స్' బృందం సమగ్ర దర్యాప్తు జరిపి నిందితులను అదుపులోకి తీసుకుంది.

**జిల్లా వ్యాప్తంగా 25 కేసుల్లో నిందితుల ప్రమేయం:**
పోలీసుల విచారణలో నిందితులకు జిల్లా వ్యాప్తంగా నమోదైన మొత్తం 25 చోరీ కేసుల్లో ప్రత్యక్ష ప్రమేయం ఉన్నట్లు నిర్ధారణ అయింది. నిందితులను రాజశేఖర్, రాజేశ్వర్, శ్రీకాంత్, రామ్ చరణ్, క్రాంతిలుగా గుర్తించారు. వీరి వద్ద నుండి 3 ద్విచక్ర వాహనాలు, 7.5 గ్రాముల బంగారం, 300 గ్రాముల వెండి ఆభరణాలు, 5 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని 16 కేసుల్లో రికవరీ పూర్తి చేశారు.

**టౌన్, రూరల్ పరిధిలోని పలు ఆలయాల్లో చోరీలు:**
నిర్మల్ టౌన్ పరిధిలోని మహాదేవ్‌పురం, ప్రియదర్శిని నగర్, సోఫీనగర్, బంగల్‌పేట్ మహాలక్ష్మి ఆలయం, శాస్త్రినగర్ హనుమాన్ ఆలయం, దివ్యనగర్ అయ్యప్ప స్వామి ఆలయాల్లో జరిగిన వెండి కిరీటాలు, నగదు చోరీ కేసులను పోలీసులు ఛేదించారు. అలాగే రూరల్ పరిధిలోని కొట్ల-కె రామాలయంలో చోరీ కేసును ఛేదించారు.

**మండలాల్లోనూ ఆలయాలే లక్ష్యంగా దొంగతనాలు:**
మామడ మండలం కొరిటికల్ వెంకటేశ్వర స్వామి ఆలయం, సారంగాపూర్ మండలం వంజర్ మహాలక్ష్మి, ఆలూర్ శివాలయం, లోకేశ్వరం మండలం కిష్టాపూర్ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం, లక్ష్మణచాంద మండలం వాడ్యాల్ హనుమాన్ ఆలయం, తానూర్ పోచమ్మ ఆలయాల్లో వెండి ఆభరణాల చోరీలకు ఈ ముఠా పాల్పడినట్లు తేలింది.

**ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనూ చోరీలు:**
ఈ ముఠా సభ్యులు ఆంధ్రప్రదేశ్ లోని గన్నవరం వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం, ఏలూరు వినాయక ఆలయంలోనూ చోరీలకు పాల్పడినట్లు విచారణలో అంగీకరించారు. సీసీ కెమెరాల ఫుటేజీలు, సెల్ ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా టాస్క్ ఫోర్స్ పోలీసులు నిందితుల కదలికలను కనిపెట్టి పక్కా ప్రణాళికతో పట్టుకున్నారు.

**పోలీస్ అధికారులను అభినందించిన ఎస్పీ:**
అంతర్రాష్ట్ర దొంగల ముఠా గుట్టురట్టు చేసి సొత్తును రికవరీ చేసిన భైంసా ఏఎస్పీ సాయి కిరణ్, నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, సీఐలు కృష్ణ, సమ్మయ్య, ఎస్సైలు లింబాద్రి, గణేష్, శ్రీకాంత్, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఆలయాలు, వ్యాపార సంస్థల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

# నిర్మల్ సర్కిల్ పరిధిలో 11 నూతన ఇంటర్ లింక్ లైన్లు

నిర్మల్, ఆగస్టు 17 (తెలంగాణ వెన్నెల వాక్కు):
నిర్మల్ సర్కిల్ పరిధిలో నాణ్యమైన నిరంతర విద్యుత్ సరఫరా కోసం 11 నూతన 33 కేవీ ఇంటర్ లింక్ లైన్లను ఏర్పాటు చేసినట్లు ఎస్ఈ రమేష్ తెలిపారు.ఒక సబ్ స్టేషన్‌లో సమస్య వచ్చినా మరో లైన్ ద్వారా సరఫరా అందించవచ్చన్నారు.దీనివల్ల ప్రకృతి వైపరీత్యాలు, మరమ్మతుల సమయాల్లో అంతరాయాలు ఉండవన్నారు.సర్కిల్ పరిధిలోని 91 సబ్ స్టేషన్లలో 76 లైన్లలో ఇంటర్ లింకింగ్ పూర్తి చేశామన్నారు.అలాగే 7 ముఖ్యమైన 11 కేవీ ఇంటర్ లింకింగ్ లైన్లను కూడా అందుబాటులోకి తెచ్చామన్నారు.ఈ ప్రత్యామ్నాయ సరఫరా వ్యవస్థ వల్ల వినియోగదారులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. తక్కువ సమయంలోనే విద్యుత్ పునరుద్ధరణ చేయడానికి వీలు కలుగుతుం దన్నారు .వినియోగదారులకు మెరుగైన విద్యుత్ అందించడమే లక్ష్యమని ఎస్ఈ స్పష్టం చేశారు. ఈ వ్యవస్థ జిల్లాలో విద్యుత్ రంగాన్ని మరింత బలోపేతం చేస్తుందన్నారు.




# టీజీ ఎన్పీడీసీఎల్ వాట్సాప్ చాట్‌బాట్ సేవలు ప్రారంభం

నిర్మల్, ఆగస్టు 17 (తెలంగాణ వెన్నెల వాక్కు):
విద్యుత్ సమస్యల తక్షణ పరిష్కారం కొరకు సరికొత్తగా కృత్రిమ మేధతో కూడిన వాట్సాప్ చాట్‌బాట్ సేవలను టీజీ ఎన్పీడీసీఎల్ అందుబాటులోకి తెచ్చింది. వినియోగదారులు 8712481489 నంబర్‌ను సేవ్ చేసుకుని హాయ్ అని పంపాల్సి ఉంటుంది.ఈ విధానం ద్వారా విద్యుత్ బిల్లులు, నూతన కనెక్షన్ల వివరాలు వెంటనే తెలుసుకోవచ్చు.కార్యాలయాల చుట్టూ తిరిగే పనిలేకుండా ఇంటి నుంచే 24 గంటలూ ఫిర్యాదులు చేయవచ్చు.నమోదైన ఫిర్యాదులు సంబంధిత అధికారులకు చేరి వేగంగా పరిష్కారం లభిస్తుంది.టోల్‌ఫ్రీ నంబర్ 1912 మరియు మొబైల్ యాప్ సేవలు కూడా నిరంతరం కొనసాగుతాయి.సాంకేతికతతో వేగవంతమైన ప్రజా సేవలు అందించడమే లక్ష్యమని అధికారులు తెలిపారు.వినియోగదారులు ఈ డిజిటల్ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ నూతన విధానం ద్వారా విద్యుత్ సేవలలో మరింత పారదర్శకత పెరుగుతుందన్నారు.

# జీవో నెంబర్ 97ను రద్దు చేయాలి: ఎస్ఎఫ్ఐ డిమాండ్



నిర్మల్, ఆగస్టు 17 (తెలంగాణ వెన్నెల వాక్కు):
యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ పేరుతో పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులను ఐటీఐలతోఅనుసంధానం చేసే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది.సోమవారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఎదుట విద్యార్థులతో కలిసి నిరసన తెలిపారు.ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ దిగంబర్ మాట్లాడుతూ జీవో 97ను రద్దు చేయాలన్నారు.సాంకేతిక విద్యా మండలి ప్రాధాన్యతను తగ్గించే కుట్రలను మాను కోవాలన్నారు.పాలిటెక్నిక్ కోర్సులను ఇంజనీరింగ్ స్థాయికి అప్‌గ్రేడ్ చేయాలని కోరారు .విద్యార్థులను కేవలం కార్మికులుగా మార్చే విధానాలను వెనక్కి తీసుకోవాలన్నారు. స్కిల్ యూనివర్సిటీ పేరుతో విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకోవద్దని హెచ్చరించారు .ప్రభుత్వం మొండిగా ముందుకెళ్తే రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపడతామ న్నారు .కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# కల్యాణలక్ష్మి పథకాన్ని కొనసాగించాలి: బాసరలో బీఆర్ఎస్ వినతి



బాసర, ఆగస్టు 17 (తెలంగాణ వెన్నెల వాక్కు):
పేదల సంక్షేమం కోసం గత ప్రభుత్వం అమలు చేసిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలనునిరంతరాయంగా కొనసాగించాలని కోరుతూ బాసరలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.బాసర తహసీల్దార్ కార్యాలయం ఎదుట పార్టీ శ్రేణులు ధర్నా నిర్వహించాయి.మండల అధ్యక్షుడు శ్యామ్ కొర్వా నేతృత్వంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు తల్లిదండ్రులపై ఆర్థిక భారం పడకుండా పథకం నిలవాలన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేసే కుట్రలు ఆపాలన్నారు.వెంటనే లబ్ధిదారులకు నిధులు విడుదల చేసి అండగా నిలవాలని కోరారు. ప్రభుత్వ తీరు మారకుంటే మండల వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామన్నారు.
ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. రైతులు, పేదల హక్కుల కోసం బీఆర్ఎస్ ఎల్లప్పుడూ పోరాడుతుందని స్పష్టం చేశారు.

# సారంగాపూర్ మండల బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ కమిటీ ఎన్నిక



సారంగాపూర్, ఆగస్టు 17 (తెలంగాణ వెన్నెల వాక్కు):
సారంగాపూర్ మండల కేంద్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ నూతన తాత్కాలిక కమిటీని జిల్లా అధ్యక్షుడు యాటకారి సాయన్న ముదిరాజ్ సమక్షంలో సోమవారం ఎన్నుకున్నారు. మండల కన్వీనర్‌గా అల్లాడి నర్సయ్య, కో-కన్వీనర్‌గా చింతకింది సాయన్న ఎంపికయ్యారు.సలహాదారుగా పిల్లి సంతోష్, సభ్యులుగా మేకల సింహం, కృష్ణ, లక్ష్మయ్య నియమితులయ్యారు.బహుజన వర్గాల హక్కుల సాధనకు, ఐక్యతకు కమిటీ నిరంతరం శ్రమిస్తుందన్నారు.గ్రామీణ స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేస్తామని తెలిపారు.అణగారిన వర్గాల విద్యా, ఉపాధి అవకాశాల రక్షణకు కృషి చేస్తామని పేర్కొన్నారు.నూతనంగా ఎన్నికైన ప్రతినిధులను నాయకులు శాలువాలతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో రామగిరి రవీంద్ర మహారాజ్, సుధాకర్, బుచ్చన్న, వినోద్ పాల్గొన్నారు.కమిటీ బలోపేతానికి కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

# తానూర్‌లో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌పై బీఆర్ఎస్ ధర్నా



తానూర్, ఆగస్టు 17 (తెలంగాణ వెన్నెల వాక్కు):
కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలులో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తానూర్ మండల కేంద్రంలో సోమవారం ధర్నా నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకురాలు పడకంటి రమాదేవి నేతృత్వంలో ఈ నిరసన చేపట్టారు. పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక భరోసా నిలిచిపోవడంతో పేదలు ఇబ్బంది పడుతున్నారన్నారు.పెండింగ్‌లో ఉన్న లబ్ధిదారులందరికీ తక్షణమే ఆర్థిక సాయం అందించాలన్నారు.కోర్టు స్టే సాకుతో పేదల సంక్షేమాన్ని నిలిపివేయడం సరికాదన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకుని లబ్ధిదారులకు న్యాయం చేయాలని రమాదేవి కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ చెక్కులు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నా రు.స్పందించకపోతే ప్రజాక్షేత్రంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరిం చారు.

# ముధోల్ మండలంలో ఘనంగా నాగుల పంచమి వేడుకలు

ముధోల్, ఆగస్టు 17 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ముధోల్ మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లో సోమవారం నాగుల పంచమి పండుగ వేడుకలను మహిళలు భక్తిశ్రద్ధలతో అత్యంత ఘనంగా జరుపుకున్నారు. మహిళలు, చిన్నారులు సంప్రదాయ వస్త్రాలు ధరించి పుట్టల వద్దకు చేరుకున్నారు. నాగదేవతకు పాలు పోసి, ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తమ సోదరుల కళ్లను పాలతో కడిగి ఆయురారోగ్యాలు కలగాలని దీవించారు.నాగుల పంచమిని పురస్కరించుకుని గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.పురాతన శ్రీ జటాశంకర ఆలయం, పశుపతినాథ్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి.భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీలు ఏర్పాట్లు చేశాయి.లగ్రామాల్లో పండుగ శోభ వెల్లివిరిసి ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.ఈ పూజా కార్యక్రమాల్లో మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# బీజేపీ జాతీయ కార్యవర్గంలో ఏపీకి ప్రాధాన్యం

విస్తృతం చేస్తున్న సమయంలో జాతీయ కార్యవర్గంలో రాష్ట్రానికి ప్రాతినిధ్యం లేకపోవడం పార్టీ వ్యూహంపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. అయితే జాతీయ కార్యవర్గంలో పదవులు దక్కకపోవడాన్ని రాష్ట్ర నాయకుల ప్రాధాన్యం తగ్గినట్లుగా చూడాల్సిన అవసరం లేదని, పార్టీ ఇతర బాధ్యతల్లో తెలంగాణ నేతలకు అవకాశాలు కల్పించే అవకాశం ఉందనే అభిప్రాయం కూడా వినిపిస్తోంది.మరోవైపు రాబోయే రోజుల్లో రాష్ట్రాల వారీగా పార్టీ ఇన్‌చార్జీలు, సహ ఇన్‌చార్జీలు, సంస్థాగత కమిటీల్లో మార్పులు జరిగే అవకాశం ఉంది. ఆ సమయంలో తెలంగాణకు ప్రత్యేక ప్రాధాన్యం లభిస్తుందా? రాష్ట్రంలో పార్టీని నడిపించేందుకు కొత్త నాయకత్వానికి అవకాశం కల్పిస్తారా? అనే అంశాలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.మొత్తంగా బీజేపీ నూతన జాతీయ కార్యవర్గ ప్రకటనలో ఆంధ్రప్రదేశ్‌కు పురందేశ్వరి రూపంలో కీలక పదవి దక్కగా.. తెలంగాణ నుంచి ఒక్క నేతకూ స్థానం లేకపోవడం రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ చర్చనీయాంశంగా మారింది. ఈ పరిణామం వెనుక పార్టీ అధిష్టానం అనుసరిస్తున్న వ్యూహం ఏమిటన్నది రాబోయే రోజుల్లో స్పష్టమయ్యే అవకాశం ఉంది.

OWNED AND EDITED BY VENKAGARI BHUMIAIAH, H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILWALPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, PUBLISHED BY YOGESH KUMAR D, H. NO. 3-167, DILAWARPUR VILLAGE & MANDAL, NIRMAL, TELANGANA-504306, PRINTER MOHAMMAD ABDUL RAHEMAN PRINTED AT MMI PRINTING PRESS 1-227/A, HIGHWAY ROAD, KONDAPALLE REBBANA, KONARAM BHEEM, ASIFABAD, MANCHERIAL, TELANGANA-504292, PUBLISHED AT H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILAWARPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, EDITOR: BDT VENKAGARI BHUMIAIAH, PRGI REGISTRATION NUMBER TG-TEL/25/A0871, CELL: 9848568953, MAIL ID: telanganavennelawakku@gmail.com